సాక్షి శ్రీకాకుళం

మంగళవారం । 21 । మే । 2024



భూసారం పెంచుదాం

భూసారం పెంచడానికి పచ్చిరొట్ట చక్కటి మార్గం. ఈ విత్తనాలు సబ్సిడీపై అందిస్తున్నారు. - 8లో



మహేంద్ర తనయలో పడి..

మహేంద్ర తనయ నదిలో పడి ఓ యువకుడు మృతి చెందాడు. ఆంధ్రా ఒడిశా సరిహద్దులో ఘటన జరిగింది. - 8లో



విరబూసిన మే పుష్పం

మెళియాపుట్టి: మండల కేంద్రంలోని నలంద పాఠశాలలో మే పుష్పం విరబూసింది. చూడటానికి ముద్దుగా.. అందంగా ఉండటంతో ప్రజలు ఆసక్తిగా తిలకించారు.

న్యూస్‌రీల్‌

24న ఎచ్చెర్ల ఐటీఐలో జాబ్‌ మేళా

ఎచ్చెర్ల క్యాంపస్‌: ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐలో ఈ నెల 24వ తేదీన జాబ్‌ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్‌, జిల్లా కన్వీనర్‌ ఎల్‌.సుధాకరరావు తెలిపారు. ఎచ్చెర్ల ఐటీఐలో సోమవారం వివరాలు వెల్లడించారు. ఐటీఐ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. 13 ప్రైవేటు కంపెనీలు ఈ జాబ్‌మేళాలో పాల్గొంటాయని వివరించారు. నెల్లూరుకు చెందిన అల్‌స్టోం, సుజు మోటార్స్‌, ఇన్‌ఫ్లూమ్‌, డికో, ఏసెన్‌, అనంతపురానికి చెందిన హ్యూందాయ్‌, ఏసీటీ, కెఐఎంఎల్‌, కేఎస్‌హెచ్‌, డీఎస్‌, సోయన్‌, సాంగో తిరుపతికి చెందిన డిక్సన్‌ కంపెనీలు పాల్గొంటాయని తెలిపారు. మొత్తం 550 ఉద్యోగాల వరకు కల్పిస్తారని అన్నారు. 18 నుంచి 35 ఏళ్ల మధ్య వయస్సు వారు అర్హులని తెలిపారు. రూ.15 వేల నుంచి రూ.18 వేల వరకు నెల వారీ వేతనం ఉంటుందని అన్నారు. 10వ తరగతి, కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్‌ కార్డులతో హాజరు కావాలని అన్నారు. ఒరిజనల్‌ ధ్రువీకరణ పత్రాలు, రెండు బయోడేటా పత్రాలుతో హాజరు కావాలని సూచించారు. ఫోన్‌ నంబర్లు 9959353636, 6304033963 సంప్రదించాలని సూచించారు.

‘ప్రత్యేక అవసరాల పిల్లలపై దృష్టి’



బడి బయట ఉన్న దివ్యాంగ బాలలను పరిశీలిస్తున్న బుడుమూరు గోవిందరావు

జలుమూరు: ప్రత్యేక అవసరాల గల పిల్లలపై దృష్టి సారిస్తున్నామని జిల్లా సహిత విద్యా విభాగం కో ఆర్డినేటర్‌ బుడుమూరు గోవిందరావు తెలిపారు. ఆయన సోమవారం జలుమూరు మండలంలోని పలు గ్రామాల్లో దివ్యాంగ పిల్లల సర్వే నిర్వహించారు. బడి బయట ఉన్న 0 నుంచి 18 ఏళ్ల లోపు దివ్యాంగ విద్యార్థులను గుర్తించి పాఠశాలలో చేర్పించి వాళ్లకి అన్ని రకాల సదుపాయాలు కల్పించాలని సూచించారు. ఆయనతో పాటు విద్య సహా కో ఆర్డినేటర్‌ ఉమా మహేశ్వరి, రమేష్‌, కృష్ణ ప్రసాద్‌ తదితరులున్నారు.

ఆదివాసీల క్రికెట్‌ టోర్నమెంట్‌ ప్రారంభం



క్రికెట్‌ టోర్నమెంట్‌ ప్రారంభిస్తున్న వాబ యోగేశ్వరరావు

సారవకోట: మండలంలోని గొర్రిబంద పంచాయతీ జగన్నాథపురం గిరిజన గ్రామంలో సోమవారం ఆదివాసీ సంక్షేమ పరిషత్‌ రాష్ట్ర ఉపాధ్యక్షులు వాబ యోగేశ్వరరావు క్రికెట్‌ టోర్నమెంట్‌ ప్రారంభించారు. గిరిజన గ్రామాల్లోని యువత క్రీడల్లో రాణించేందుకు ఈ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. జిల్లా నుంచి 36 జట్లు పాల్గొననున్నాయని తొలి మ్యాచ్‌ జగన్నాథపురం, బురుజువాడ టీంల మధ్య జరిగినట్లు ఆయన తెలిపారు.


‘క్రీడలతో గుర్తింపు సాధ్యం’



ఎంపికైన క్రీడాకారులతో ఎమ్మెస్సార్‌ కృష్ణమూర్తి, అర్జున్‌రెడ్డి

శ్రీకాకుళం న్యూకాలనీ: అంతర్జాతీయ స్థాయిలో గౌరవం, గుర్తింపు క్రీడలు, కళలతోనే సాధ్యపడుతుందని జిల్లా బాస్కెట్‌బాల్‌ అసోసియేషన్‌ చైర్మన్‌ ఎమ్మెస్సార్‌ కృష్ణమూర్తి పేర్కొన్నారు. శ్రీకాకుళం నగరంలోని ఎన్టీఆర్‌ మున్సిపల్‌ కార్పొరేషన్‌ హైస్కూల్‌ క్రీడామైదానం వేదికగా జరుగుతున్న జిల్లా యూత్‌ బాల బాలికల బాస్కెట్‌బాల్‌ జట్ల శిక్షణ శిబిరాల్లో రాణించిన క్రీడాకారుల తుది జట్లను సోమవారం ప్రకటించారు. ఎంపికైన క్రీడాకారుల జాబితాను ఎమ్మెస్సార్‌ కృష్ణమూర్తి వెల్లడించారు. ఈ నెల 21 నుంచి 24వ తేదీ వరకు విజయవాడ వేదికగా జరిగే 7వ ఏపీ రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్‌ చాంపియన్‌షిప్‌ పోటీలకు జిల్లా జట్లు జిల్లా కేంద్రం నుంచి పయనమై వెళ్లాయి. వీరికి రానుపోను ఖర్చుల కోసం అవసరమైన ఆర్థిక సాయాన్ని ఎమ్మెస్సార్‌ అందజేశారు. క్రమశిక్షణగా ఆడి తుది వరకు పోరాడాలని ఆయన క్రీడాకారులకు పిలుపునిచ్చారు. క్రీడల్లో రాణించి జిల్లాకు, తల్లిదండ్రులకు, సంఘానికి గౌరవాన్ని తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో సంఘ కార్యనిర్వాహక కార్యదర్శి, డీఎస్‌ఏ కోచ్‌ జి.అర్జున్‌రావురెడ్డి, సంఘ ప్రతిని

తగ్గని ఎన్నికల వేడి




- ఓటింగ్‌ సరళిపై విశ్లేషించుకుంటున్న నాయకులు
- సోషల్‌ మీడియా విశ్లేషణలను చర్చించుకుంటున్న ప్రజలు
- జనం నాడి కోసం ఐవీఆర్‌ఎస్‌ కాల్స్‌ చేస్తున్న పందెంరాయుళ్లు
- స్పష్టత రాక గింజుకుంటున్న ఆసక్తిదారులు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం :

ఓటింగ్‌ ముగిసి వారమైపోయింది. అయినా గ్రామాల్లో ఇంకా ఎన్నికల వేడి తగ్గలేదు. ఫలితాలపై రోజురోజుకూ ఉత్కంఠ పెరుగుతోంది. ఓట్ల లెక్కింపునకు మరో 14రోజులు ఉండటంతో ఎవరి భవితవ్యం ఎలా ఉండబోతుందోనని అంతా లెక్కలేసుకుంటున్నారు. గతసారి ఎన్నికల కంటే ఈసారి పోలింగ్‌ శాతం పెరగడంతో ఎవరికి వారు తమకు అనుకూలంగా ఫలితాలు వస్తాయని అంచనాలు వేసుకుంటున్నారు. సందట్లో సడేమియా అన్నట్టు పందెం రాయళ్లు కూడా బరిలోకి దిగారు. ఎక్కడెక్కడి నుంచో ఐవీఆర్‌ఎస్‌ మాదిరిగా ఫోన్‌ కాల్‌ చేసి ఎవరికి ఓటేశారు? ఎవరు గెలవడానికి అవకాశం ఉంది? అని ఓటర్లను అడుగుతున్నారు. కానీ ఈ కాల్స్‌కు విసుగెత్తిపోయి చాలామంది కట్‌ చేసేస్తున్నారు. దీంతో పందెం రాయళ్లకు కూడా జనం నాడి అంతుచిక్కని పరిస్థితి ఏర్పడింది.

ఫోన్‌ సర్వేల్లో పందెం రాయళ్లు

ఎన్నికలు వస్తే చాలు పందెంరాయళ్లు బరిలోకి దిగుతారు. ఒకవైపు ఐపీఎల్‌ క్రికెట్‌ పందేలు జోరుగా జరుగుతుండగా.. అదే స్థాయిలో ఎన్నికల ఫలితాలపై పందేలకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో ఎవరివైపు పందెం కాస్తే బాగుంటుందనే దానిపై ఐవీఆర్‌ఎస్‌ మాదిరిగా ఓటర్లకు ఫోన్‌ చేసి తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు. అభ్యర్థుల ఎంపిక సమయంలో ప్రజల మనోగతాన్ని తెలుసుకునేందుకు రాజకీయ పార్టీలు ఫోన్‌ ద్వారా సర్వే చేశాయి. ఇందులో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఎక్కువగా ఐవీఆర్‌ఎస్‌ కాల్స్‌ చేసి ప్రజల్ని ఇబ్బంది పెట్టారు. ప్రజాభిప్రాయం మేరకు అభ్యర్థులను ఖరారు చేయనప్పటికీ తాను అనుకుంటున్న వాళ్లకి, వ్యతిరేకిస్తున్న వారికి ఆ అభిప్రాయ సేకరణ చూపించి అభ్యర్థుల ఎంపిక ప్రహసనం పూర్తి చేశారు. ఇక, ప్రచార సమయంలోనైతే ఫోన్‌ కాల్స్‌ ద్వారా ప్రజల్ని పెద్ద ఎత్తున విసుగెత్తించారు. కాల్స్‌ చేయడం, చెప్పింది వినాలని కోరడం, తమ పథకాలను ప్రచారం, వైఎస్‌ జగన్‌పై దుష్ప్రచారం చేయడం వంటివి పెద్ద ఎత్తున చేశారు. ఈ కాల్స్‌ లిఫ్ట్‌ చేయలేక ప్రజలు పెద్ద ఎత్తున ఇబ్బంది పడ్డారు. పోలింగ్‌తో ఈ కాల్స్‌ తగ్గాయనుకుంటే పందేం రాయళ్ల కాల్స్‌ రావడం ప్రారంభమయ్యాయి.



కాల్స్‌ కట్‌ చేస్తున్న ప్రజలు

ఐవీఆర్‌ఎస్‌ మాదిరి కాల్స్‌కు విసుగెత్తిన ప్రజలు పందెం రాయళ్లు చేసే కాల్స్‌కు, గెలుపు అంచనాలను తెలుసుకునేందుకు వివిధ సంస్థలు చేసే కాల్స్‌కు ప్రజలు పెద్దగా సహకరించడం లేదు. మీరు ఏ పార్టీకి ఓటు వేశారు, ఎమ్మెల్యే ఓటు ఎవరికేశారు, ఎంపీ ఓటు ఎవరికి వేశారు అని అడుగుతూ అందుకు చెప్పిన అంకెలు నొక్కండి అంటూ కాల్‌లో విసిగిస్తున్నారు. వీటికి అతి కొద్దిమంది మాత్రమే స్పందిస్తున్నారు. చాలా మంది ఆ ప్రశ్నలకు సమాధానం ఇవ్వకుండా కాల్‌ కట్‌ చేసేస్తున్నారు. దీంతో ఆయా పందేం రాయళ్లకు, స్టడీ సంస్థలకు జనం నాడి చిక్కని పరిస్థితి ఏర్పడింది. మొత్తానికి అటు అభ్యర్థులకు, ఇటు పందేం కాసే వారికి, మరోవైపు ఫోన్‌ సర్వేపై ఆధారపడి చేసే స్టడీ సంస్థలకు స్పష్టత రావడం లేదు.

ఎడతెగని విశ్లేషణలు

పోలింగ్‌ ముసిగిన మరుసటి రోజు నుంచి అభ్యర్థులు, వారి అనుయాయులు బూత్‌ల వారీగా పోలింగ్‌ సరళిపై విశ్లేషణ చేసుకుంటున్నారు. ఇందులో భాగంగా ఏయే కేంద్రాల్లో ఎక్కువ ఓట్లు పోలయ్యాయి. అక్కడెలా ఓటింగ్‌ జరిగింది. వాటిలో తమ పార్టీకి ఎన్ని ఓట్లు పడి ఉంటాయి, తమ పార్టీకి ఏ మేరకు కలిసొస్తుందని ఆరా తీస్తున్నారు. అన్ని కోణాల్లోనూ ఓటర్లు ఎవరికి ఓటేశారని కూలంకషంగా లెక్క లు వేసుకుంటున్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న పోలింగ్‌ బూత్‌ల్లో 40శాతం తక్కువ కాకుండా ఓటింగ్‌ జరిగింది. 60 నుంచి 70 శాతం, 70 నుంచి 80 శాతం, 80 నుంచి 90 శాతం పోలింగ్‌ కేంద్రాలే ఎక్కువగా ఉన్నాయి. దాదాపు ఈ పర్సంటేజీల్లోనే ఎక్కువ ఓటింగ్‌ జరిగింది. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఆయా పోలింగ్‌ బూత్‌ల్లో అనుకూలంగా వచ్చే ఓట్లు ఎన్ని, ప్రతికూలంగా ఓట్లు ఎన్ని ఆరా తీస్తున్నారు. వివిధ మార్గాల ద్వారా వచ్చే వివరాలతో అనుకూలంగా వస్తే హమ్మయ్యా అని సంతోష పడుతున్నారు. ప్రతికూలంగా వస్తే అయ్యో దెబ్బ కొట్టినట్టు ఉందే అని ఉసూరుమంటున్నారు. అభ్య ర్థులంతా లెక్కల బిజీలో ఉంటే పబ్లిక్‌లో మాత్రం ఏ ఇద్దరు కలిసినా ఎన్నికల ఫలితాల గురించే మాట్లాడుకుంటున్నారు. వివిధ సంస్థలు చేసే పోలింగ్‌ అనంతరం స్టడీలు, సోషల్‌ మీడియాలోని విశ్లేషణలపై చర్చించుకుంటున్నారు.

మల్లేష్‌కు కన్నీటి వీడ్కోలు



తోట మల్లేష్‌ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహిస్తున్న కుమారుడు మాధవరావు

కోటబొమ్మాళి: వెంకటాపురం గ్రామంలో ఈ నెల 16న ఎండలవారాల పండగ సందర్భంగా గ్రామదేవత గుడి వద్ద జరిగిన ఘర్షణలో టీడీపీ వర్గీయుల దాడిలో తీవ్రంగా గాయపడి మృతి చెందిన వైఎస్సార్‌ సీపీ కార్యకర్త తోట మల్లేష్‌కు సోమవారం కన్నీటి వీ డ్కోలు పలికారు. ఆయన మృతదేహాన్ని విశాఖపట్నం నుంచి అంబులెన్సులో పోలీసుల పర్యవేక్షణలో స్వగ్రామానికి తీసుకువచ్చారు. అప్పటికే బంధువులు, పార్టీ అభిమానులు వెంకటాపురానికి భారీగా చేరుకోవడంతో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. మల్లేష్‌ మృతదేహం వద్ద ఆయన భార్య ఆదిలక్ష్మి, కుమారుడు మాధవరావు బోరున విలపించడంతో అక్కడ ఉన్న వారంతా కన్నీటి పర్యంతమయ్యారు. గ్రామస్తులు బంధువులు, అభిమానులు, వైఎస్సార్‌ సీపీ నాయకులు, కార్యకర్తలు మృతదేహం వద్ద ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మల్లేష్‌ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. అంతిమ యాత్రలో వైఎస్సార్‌ సీపీ నాయకులు రోణంకి మల్లయ్య, మెండ తాతయ్య, దుక్క రామకృష్ణ, చింతాడ అనిరుద్రుడు, బోనె ఎల్లయ్య, రెడ్డి లక్ష్మణ, నేతింటి అప్పలస్వామి, ఎస్‌పీ రమణమూర్తి, గూట్ల లక్ష్మణరావు, కోత చిన్నారావు, తోట^ఎసింహాచలం, కాల్ల గణపతి, బెలమర మహేష్‌ పాల్గొన్నారు.

వైఎస్సార్‌ సీపీ నాయకుల గృహనిర్బంధం

తోట మల్లేష్‌ అంత్యక్రియలకు హాజరయ్యేందుకు కార్యకర్తలతో సిద్ధమవుతున్న కాళింగ కార్పొరేషన్‌ డైరెక్టర్‌ ఎస్‌.హేమసుందరరాజును కమలనాభపురంలోనూ, జిల్లా రైతు సమాఖ్య సభ్యుడు కవిటి రామరాజులను పోలీసులు హౌస్‌ అరెస్టు చేశారు.

తిలక్‌కు గృహ నిర్బంధం

- మల్లేష్‌ అంతిమ యాత్రకు వెళ్లకుండా అడ్డుకున్న పోలీసులు



కణితూరులో పేరాడ తిలక్‌ను గృహ నిర్బంధం చేసిన పోలీసులు

నందిగాం: కోటబొమ్మాళి మండలం నిమ్మాడ పంచాయతీ చిన్న వెంకటాపురానికి చెందిన తోట మల్లేష్‌ అంతిమ యాత్రకు వైఎస్సార్‌ సీపీ ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్‌ వెళ్లకుండా పోలీసులు సోమవారం ఆయన స్వగ్రామం కణితూరులో గృహ నిర్బంధం చేశారు. నందిగాం ఎస్‌ఐ మహమ్మద్‌ అమీర్‌ ఆలీ ఆధ్వర్యంలో స్థానిక పోలీసులు, ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ సిబ్బంది 20 మంది సోమవారం ఉదయం తిలక్‌ ఇంటి వద్దకు చేరుకొని ఆయన బయటకు వెళ్లకుండా గృహనిర్బంధం చేశారు. దీంతో విషయం తెలుసుకున్న వివిధ మండలాల నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు అక్కడకు చేరుకొని పోలీసుల తీరుపై విస్మయం వ్యక్తం చేశారు. పలువురు నాయకులు మాట్లాడుతూ అచ్చెన్నాయుడు అడ్డాలో పోలింగ్‌ ఏజెంట్‌గా వైఎస్సార్‌ సీపీ తరపున తోట మాధవరావు వెళ్లి రిగ్గింగ్‌ జరగకుండా నిలువరించడంతో, అచ్చెన్నాయుడు ప్రోద్బలంతో తెలుగుదేశం మూకలు గ్రామదేవత పండగలో మాధవరావు తండ్రి మల్లేష్‌పై దాడి చేసి మృతికి కారణమయ్యారని. అలాంటి వారిని అరెస్టు చేయకుండా, పార్టీ కార్యకర్త అంతిమయాత్రలో పాల్గొనేందుకు వెళ్తున్న నాయకుడిని హౌస్‌ అరెస్టు చేయడం పోలీసులకు తగదని అన్నారు.

‘మల్లేష్‌ మృతిపై విచారణ కోరుతాం’

నందిగాం: మల్లేష్‌ మృతిపై జుడీషియల్‌ ఎంక్వైరీ కోరుతామని వైఎస్సార్‌సీపీ శ్రీకాకుళం ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్‌ తెలిపారు. సోమవారం తనను తన ఇంటి వద్ద గృహనిర్బంధం చేసిన అనంతరం తిలక్‌ విలేకరులతో మాట్లాడారు. మల్లేష్‌ హత్య కేసులో పోలీసులు నియంతృత్వ ధోరణితో వ్యవహరించారని విమర్శించారు. మాధవరావు తల్లి ఇచ్చిన లిఖితపూర్వక ఫిర్యాదులో అచ్చెన్నాయుడు, హరిప్రసాద్‌, రామ్మోహననాయుడు ప్రేరణతోనే దాడి జరిగిందని పేర్కొన్నారని, కానీ టెక్కలి డీఎస్పీ దీనిలో రాజకీయ కోణం లేదని ప్రెస్‌నోట్‌ విడుదల చేయడం కేసును పక్కదోవ పట్టించడమేనని అన్నారు. బాధితులు చేసిన ఫిర్యాదును పరిగణనలోకి తీసుకోకుండా, హత్యకు ప్రేరేపించిన వారిని కస్టడీలోకి తీసుకోకుండా, దహన సంస్కారాలను బంధువులు వెళ్లకుండా అడ్డుకోవడం, అంతిమయాత్రలో పాల్గొనేందుకు వెళ్తున్న నాయకులను గృహ నిర్బంధం చేయడం సరికాదన్నారు. దీనిపై జిల్లా రిటర్నింగ్‌ అధికారికి, రాష్ట్ర, కేంద్ర ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసి జుడీషియల్‌ ఎంక్వైరీ కోరుతామని ఆయన తెలిపారు. పల్నాడు జిల్లాలో జరిగే అల్లర్లపై చేపట్టే సిట్‌ దర్యాప్తు చిన్న వెంకటాపురంలో ఘటనలో కూడా చేపట్టాలని కోరుతామన్నారు. ఈ దాడికి ప్రేరేపించిన వారిని తక్షణం అరెస్టు చేయాలని, లేకుంటే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి, నాయకులు చిన్ని జోగారావు, కణితి నారాయణమూర్తి, కవిటి వీరన్న, సర్లాన భైరాగి ఉన్నారు.

లూజు పెట్రోల్‌ విక్రయించరాదు



మాట్లాడుతున్న కలెక్టర్‌ మనజీర్‌ జిలానీ సమూన్‌

శ్రీకాకుళం పాతబస్టాండ్‌: కౌంటింగ్‌ ఏర్పాట్లు పక్కాగా ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్‌ డాక్టర్‌ మనజీర్‌ జిలానీ సమూన్‌ అధికారులను ఆదేశించారు. కౌంటింగ్‌ రోజున పటిష్టమైన భద్రత ఉండాలన్నారు. కౌంటింగ్‌ ఏర్పాట్లపై కలెక్టర్‌ చాంబర్‌లో ఎస్పీ జీఆర్‌ రాధికతో కలిసి సోమవారం ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల దృష్ట్యా జిల్లాలో 144 సెక్షన్‌ కొనసాగాలన్నారు. ఎన్నికల కోడ్‌ అమలు కొనసాగించాలన్నారు. జిల్లాలో ఉన్న 120 పెట్రోల్‌ బంకుల నుంచి లూజు పెట్రోల్‌ విక్రయాలు చేయకుండా సంబంధిత యజమానులకు నోటీసులు జారీ చేయాలని డీఎస్‌ఓ బి.శాంతిశ్రీని ఆదేశించారు. జిల్లాలో పండుగలు జరుపుకునే ప్రాంతాల్లో సమూహాలుగా ఉండరాదని స్పష్టం చేశారు. ఆ ప్రాంతాల్లో ఎలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించరాదన్నారు. మందుగుండు సామగ్రి (క్రేకర్లు) విక్రయించకుండా లైసెన్సులు కలిగిన యజమానులకు నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో టెక్క లి రిటర్నింగ్‌ అధికారి, సబ్‌ కలెక్టర్‌ నూరుల్‌ కమర్‌, అదనపు ఎస్పీ ప్రేమ్‌ కాజల్‌, సెబ్‌ అదనపు ఎస్పీ గంగాధరం, ఆయా నియోజకవర్గాలకు సంబంధించి రిటర్నింగ్‌ అధికారులు డాక్టర్‌ భరత్‌ నాయక్‌, సీహెచ్‌ రంగయ్య, అప్పారావు, లక్ష్మణమూర్తి, సుదర్శన్‌ దొర, రామ్మోహనరావు, డీఎస్పీలు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా తిరుక్కల్యాణం



తిరుక్కల్యాణోత్సవంలో పట్టాభిరామస్వామి

కవిటి: మండలంలోని ప్రగడపుట్టుగ కోదండరామాలయం, కవిటిలో వెలసిన పట్టాభిరామాలయాల్లో వైశాఖమాస తిరుక్కల్యాణ మహోత్సవాలు నేత్రపర్వంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బ్రహ్మపురానికి చెందిన ఆగమశాస్త్ర పండితుల బృందంతో రెండోరోజు ఉత్సవాలు సోమవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం ప్రగడపుట్టుగ పరిసర గ్రామాలకు చెందిన 1500 మంది భక్తులకు సీతారాముల కల్యాణోత్సవ విందును ఆలయ అభివృద్ధి కమిటీ గ్రామపెద్ద బల్లెడ ఎర్రప్ప ఏర్పాటుచేశారు.

‘ఎన్నికల సమయంలో డ్యూటీ పీరియడ్‌గా పరిగణించాలి’

శ్రీకాకుళం పాతబస్టాండ్‌: సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో ఎన్నికల సిబ్బంది రెమ్యూనరేషన్‌ డ్యూటీ సర్టిఫికెట్లతో పాటు వేసవి సెలవులు కావున ఆ సమయంలో డ్యూటీ పీరియడ్‌గా పరిగణించాలని పీఆర్‌టీయూ, ఏపీటీఎఫ్‌ సంఘాలకు చెందిన నాయకులు సోమవారం కలెక్టర్‌ మనజీర్‌ జిలానీ సమూన్‌ ఆయన చాంబర్‌లో వేర్వేరుగా కలిసి వినతి పత్రాలు అందజేశారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ఏపీటీఎఫ్‌ జిల్లా శాఖ అధ్యక్షులు మజ్జి మదన్మోహన్‌, జిల్లా కార్యదర్శి చావలి శ్రీనివాస్‌, సీనియర్‌ నాయకులు సదాశివుని శంకరరావు, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షులు తంగి మురళీమోహనరావు, ప్రధాన కార్యదర్శి దానేటి కేశవరావు, రాష్ట్ర గౌరవ అధ్యక్షులు భైరి అప్పారావు, రాష్ట్ర సహాధ్యక్షులు పి.రాజశేఖర్‌ రావు, బి.రవికుమార్‌ రాష్ట్ర ఉపాధ్యక్షులు కరణం సీతరాజు తదితరులు ఉన్నారు.

స్ట్రాంగ్‌ రూమ్‌లు పరిశీలించిన ఎస్పీ



స్ట్రాంగ్‌ రూమ్‌లు ఉన్న శివానీ కళాశాల ఆవరణ పరిశీలిస్తున్న ఎస్పీ జీఆర్‌ రాధిక

ఎచ్చెర్ల క్యాంపస్‌: చిలకపాలేంలోని శ్రీ శివానీ ఇంజినీరింగ్‌ కాలేజ్‌లో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌ రూమ్‌లను ఎస్పీ జీఆర్‌ రాధిక సోమవారం పరిశీలించారు. మూడంచెల భద్రత 18 స్ట్రాంగ్‌ రూమ్‌ల వద్ద సెక్యూరిటీ పరిశీలించారు. నిరంతరం అప్రమత్తంగా ఉండాలని భద్రత సిబ్బందికి సూచించారు. కౌంటింగ్‌ రోజు తీసుకోవాల్సిన చర్యలు, భద్రతపై పోలీస్‌ అధికారులతో చర్చించారు. కౌంటింగ్‌ రోజు రోడ్లు, కళాశాల ఆవరణలో ఇతరులు ఉండకుండా జాగ్రత్త పడాలని సిబ్బందికి సూచించారు. ఎలాంటి శాంతి భద్రతలు సమస్య లేకుండా పూర్తిస్థాయిలో భద్రత ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఆమె వెంట ఏఎస్పీ ప్రేమ్‌కాజల్‌, డీఎస్పీ శృతి, సీఐ జి.రామచంద్రరావు, ఎస్సై ఎస్‌.చిరంజీవి పాల్గొన్నారు.

● స్విమ్మింగ్‌ ‘కూల్‌’

వేసవి వేడిని తగ్గించుకోవడానికి పిల్లలు స్విమ్మింగ్‌ పూల్‌ను ఆశ్రయిస్తున్నారు. జిల్లా కేంద్రంలోని శాంతినగర్‌ కాలనీలో ఉన్న స్విమ్మింగ్‌ పూల్‌కు పిల్లలతో పాటు పెద్దలు కూడా వచ్చి సరదాగా ఈత నేర్చుకుంటున్నారు.

- సాక్షి ఫొటోగ్రాఫర్‌, శ్రీకాకుళం









క్లుప్తంగా

ఇసుక రీచ్‌ల పరిశీలన



కిల్లిపాలెంలో ఇసుక రీచ్‌లను పరిశీలిస్తున్న అధికారులు

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని కిల్లి పాలెం గ్రామాల్లో ఇసుక రీచ్‌లను కలెక్టర్ మన జీర్ జిలానీ సుమూన్ సోమవారం పరిశీలించారు. జిల్లా స్థాయి ఇసుక కమిటీ డీఎల్ఎస్సీలో గల అధికారులు తనిఖీలు చేసి విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకోవాలని, దానిపై ప్రతి వారం ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని కలెక్టర్ ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేశారు. తనిఖీల్లో ఆయనతో పాటు ఎస్పీ జీఆర్ రాధిక, డీపీఓ స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారి, శ్రీకాకుళం ఆర్డీవో ఇరిగేషన్ ఈఈ, జిల్లా మైన్స్ అధికారులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో తాగుబోతుల వీరంగం



ఫర్నీచర్ ధ్వంసం చేస్తున్న తాగుబోతు కెల్ల జగన్

రణస్థలం: మండలంలోని రణస్థలం సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఇద్దరు వ్యక్తులు సోమవారం వీరంగం సృష్టించారు. సీహెచ్‌సీ సిబ్బంది, జేఆర్ పురం పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. రణస్థలానికి చెందిన కెల్ల జగన్ తన తమ్ముడు కెల్ల నవీన్ కుమార్ బైక్‌పై నుంచి పడిపోయి గాయాలు కావడంతో సాయంత్రం నాలుగు గంటల సమయంలో ఆస్పత్రికి తీసుకువచ్చాడు. ఆ సమయంలో వారిద్దరూ మద్యం సేవించి ఉన్నారు. మద్యం మత్తులో కెల్ల జగన్ ఆస్పత్రిలో ఉమ్మి వేస్తూ అసభ్యంగా ప్రవర్తించాడు. దీంతో నర్సు అతడిని వారించగా ఆమెపై కూడా ఉమ్మి వేశాడు. తర్వాత అటెండర్, సెక్యూరిటీపై కూడా దుర్భాషలాడుతూ నానా యాగీ చేశాడు. ఇద్దరు అన్నదమ్ములు రికార్డులు చించేసి, తలుపులు కాళ్లతో తన్నుతూ వీరంగం సృష్టించారు. దీంతో ఆస్పత్రి సిబ్బంది భయభ్రాంతులకు గురై పోలీసులకు సమాచారం అందజేశారు. కానీ వారిద్దరూ పోలీసులతో కూడా వాదులాడారు. షర్టు విప్పేసి.. కొడతారా కొట్టండి అంటూ పైపైకి వెళ్లారు. దీంతో అక్కడి వారు వారిని అడ్డుకుని పోలీసులకు అప్పగించారు. గాయపడిన నవీన్‌కు ఆస్పత్రి సిబ్బంది రిమ్స్‌కు రిఫర్ చేస్తే 108 ఎక్కకుండా పరారైపోయాడు. ఆస్పత్రి సిబ్బంది ఇచ్చిన ఫిర్యాదు మేరకు జేఆర్ పురం ఎస్‌ఐ కె. గోవిందరావు కేసు నమోదు చేశారు.

నవధాన్యాల సాగుపై రైతులకు అవగాహన ముఖ్యం



పలాసపురంలో నవధాన్యాల కిట్లు తయారు చేస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

సోంపేట: మండలంలోని రైతులకు భూసారాన్ని పెంచుకోవడానికి ఖరీఫ్ సీజన్‌లో నవధాన్యాల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని ప్రకృతి వ్యవసాయం రీజనల్ ఆఫీసర్ హేమసుందర్ అన్నారు. మండలంలోని పలాసపురం గ్రామంలో యూనిట్ స్థాయిలో నవధాన్యాల విత్తనాల కిట్లు సోమవారం తయారు చేశారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు పంటలు సాగు చేసే ముందు నవధాన్యాలు భూమిలో చల్లుకుని, కలియ దున్నడం వల్ల కలిగే లాభాలు వివరించారు. రైతులకు నవధాన్యాల సాగు ఉపయోగాలు తెలియజేయాలని సిబ్బందికి సూచించారు. వరి పంటకు ముందు 12 కిలోల విత్తనాలు, జీడి మామిడి కొబ్బరి తోటల్లో 6 కిలోల విత్తనాలు చల్లుకోవాలన్నారు. కార్యక్రమంలో మెంటర్స్ సత్యనారాయణ, యూనిట్ ఇన్‌చార్జి కుమారి, కామరాజు తదితరులు పాల్గొన్నారు.

భూసారం పెంచుదాం

- పచ్చిరొట్టతో మేలెంతో
- ఎకరాకు 10 కిలోల విత్తనం అవసరం
- ఎకరంలో సాగు చేస్తే 5 టన్నుల ఎరువు ఉత్పత్తి
- పచ్చిరొట్ట సాగుకు సిద్ధమవుతున్న రైతులు
- రైతు భరోసా కేంద్రాల ద్వారా సబ్సిడీపై విత్తనాలు పంపిణీ



రామచంద్రాపురంలో సాగు చేసిన పచ్చిరొట్ట (ఫైల్)

ఆమదాలవలస రూరల్: రోహిణి కార్తె ప్రారంభం కావడంతో రైతులు జీలుగ విత్తనాలు సాగు చేయడానికి సిద్ధమవుతున్నారు. రోహిణి కార్తె పచ్చిరొట్ట సాగుకు అనువైన సమయంగా రైతులు భావిస్తారు. సన్నరకం వరి పండించే వారు ఇప్పటి నుంచే జీలుగ విత్తుకునే పనిలో నిమగ్నమవుతున్నారు. జిల్లాలో రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు సబ్సిడీపై పచ్చిరొట్ట ఎరువులను పంపిణీ చేసేందుకు ప్రభుత్వం అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేసింది. పచ్చిరొట్ట ఎరువు సాగు చేసే రైతుల వద్దకే ఈ విత్తనాలు అందుబాటులోకి తీసుకువచ్చింది.

భూమి సారవంతం

పచ్చిరొట్ట సాగుతో భూమి సారవంతంగా మారుతుంది. సేంద్రీయ, రసాయన ఎరువులు వేసే అవసరం తగ్గుతుంది. రసాయన ఎరువులతో భూసారం తగ్గి, పంట దిగుబడిపై ప్రభావం పడుతుండటంతో అప్రమత్తమైన అధికారులు మూడేళ్లుగా పచ్చిరొట్టలో భాగంగా జీలుగ సాగుపై ప్రత్యేక దృష్టిసారించారు. రైతులకు అవగాహన కల్పించడంలో సఫలీకృతమవుతున్నారు. ఇప్పుడు జిల్లాలో జీలుగ, పిల్లిపెసర, కట్టె జనుము సాగు చేయడానికి అన్నదాతలు ముందుకు వస్తున్నారు. వరి వెదసాగు చేసే రైతులు తక్కువగా వీటిపై ఆసక్తి చూపుతున్నారు. దమ్ము పట్టి వరినారు వేసే రైతులు పచ్చిరొట్టను సాగు చేసేందుకు సమాయత్తమవుతున్నారు. ఇప్పటికే జిల్లా యంత్రాంగం పచ్చిరొట్ట విత్తనాలను రైతు భరోసా కేంద్రాల వద్ద సరఫరా చేస్తున్నారు. రైతులు వరిసాగు చేసే నెల రోజుల ముందే పొలాల్లో పచ్చిరొట్ట విత్తనాలు జల్లుకోవాలి. ఎకరాకు 10 కిలోల పచ్చిరొట్ట విత్తనం అవసరం. నార్లు పోసే పది రోజుల ముందు నుంచే భూమిని కలియదున్నితే పైరు భూమిలో మునిగి, భూసారం పెరుగుతుంది. నేలకు సహజ మిత్రులైన వానపాముల ఉత్పత్తిని పెంచుతుంది. తుంగ, గరిక వంటి కలుపు మొక్కలను నివారించగలుగుతుంది.

కుళ్లిన తర్వాత నాట్లు వేయాలి

పచ్చిరొట్ట ఎరువు తేలికపాటి నేలల్లోనూ, ఇసుక, చౌడు భూముల్లోనూ సాగు చేసుకోవచ్చు. చౌడు భూముల్లో ఉన్న లవణాలను తీసివేసి, మంచి భూమిగా తయారు చేయడంలో ఈ పచ్చిరొట్ట ఎరువు ఎంతగానో దోహదపడుతుంది. దీని నుంచి ఎకరాకు 5 టన్నుల పచ్చిరొట్ట ఎరువు ఉత్పత్తి అవుతుంది. 35 నుంచి 45 రోజుల మధ్యలో భూమిలో కలియదున్నితే మంచిది. ఇందులో 8 కిలోల భాస్వరం, 20 కిలోల పొటాష్, 35 కిలోల నత్రజని ఉంటుంది.

పిల్లి పెసర పచ్చిరొట్టగా, పశుగ్రాసంగా ఉపయోగపడుతుంది. పచ్చి రొట్టను పొలంలో కలియదున్నితే కుళ్లిన తర్వాత నాట్లు వేసుకోవాలి.

సాగుకు రైతుల ఆసక్తి



గతంతో పోలిస్తే పచ్చి రొట్ట ఎరువు సాగుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. ప్రభుత్వం విత్తనాలను సబ్సిడీపై రైతులకు అందించడం వల్ల మరింతగా ఉపయోగపడుతుంది. మోటార్లు, చెరువుల ఆధారం ఉన్న రైతులు ఇప్పుడు ఈ విత్తనాలను సాగు చేసుకోవచ్చు. నీటి వసతి లేని వారు వర్షాలు పడిన తర్వాత వేసుకుంటే మంచిది. పచ్చి రొట్ట ఎరువుల సాగు, ఉపయోగాలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

– మెట్ట మోహనరావు, మండల వ్యవసాయాధికారి, ఆమదాలవలస మండలం

ఎంపీసీ స్ట్రీమ్ పరీక్షకు 97 మంది గైర్హాజరు

ఎచ్చెర్ల క్యాంపస్:

జిల్లాలో ఏపీఈఏపీ సెట్ కొనసాగుతోంది. ఎంపీసీ స్ట్రీమ్ పరీక్షలు ప్రస్తుతం కొనసాగుతున్నాయి. ఏపీఈఏపీ సెట్‌లో ఇప్పటి వరకు 8208 మందికి గాను 7726 మంది హాజరు కాగా, 487 మంది గైర్హాజరయ్యారు. సోమవారం 2072 మంది హాజరు కావాల్సి ఉండగా, 1975 మంది హాజరయ్యారు. 97 మంది గైర్హాజరయ్యారు. నరసన్నపేట కోర్ టెక్నాలజీస్‌లో మొదటి షిఫ్టులో 327 మందికి 311, రెండు షిఫ్టులో 327 మందికి 309 హాజరయ్యారు. టెక్కలి ఐతంలో మొదటి షిఫ్టులో 300 కి 287, రెండో షిఫ్టులో 300 కి 293 మంది హాజరయ్యారు. చిలకపాలేం శ్రీ శివానీలో మొదటి షిఫ్టులో 229 కి 214, రెండో షిఫ్టులో 230 కి 219 మంది హాజరయ్యారు. ఎచ్చెర్లలోని శ్రీ వెంకటేశ్వర ఇంజి నీరింగ్ కాలేజ్‌లో మొదటి షిఫ్టులో 179 కి 169, రెండో షిఫ్టులో 180 మందికిగాను 171 మంది హాజరయ్యారు.



శివానీలో విద్యార్థులు హాల్ టిక్కెట్లు పరిశీలిస్తున్న సిబ్బంది

అశ్రునయనాలతో అంతిమ వీడ్కోలు



పార్థివ దేహం వెంట నడిచి వెళుతున్న ప్రజలు

గార: కళింగపట్నం సచివాలయం మహిళా పోలీసుగా పనిచేస్తున్న పప్పు సుశీల పార్థివ దేహానికి కుటుంబ సభ్యులతో పాటు బంధువులు, ఉపాధ్యాయులు, స్నేహితులు, ప్రజలు అశ్రునయనాలతో అంతిమ వీడ్కోలు పలికారు. జెమ్స్‌లో అవయవ దానం పూర్తయ్యాక సోమవారం ఆమె పార్థివ దేహాన్ని స్వగ్రామమైన కె.మత్స్యలేశంకు తరలించారు. కళింగపట్నం పీహెచ్‌సీ వద్ద నుంచి యువత బైక్ ర్యాలీ ద్వారా సుశీల ఫొటోలు పట్టుకొని పార్థివ దేహం ముందు ఉండగా, ప్రజలు పెద్ద ఎత్తున ఆమె అంతిమ యాత్రలో పాల్గొని నివాళులర్పించారు. తండ్రి పప్పు గోవింద, కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో దహన సంస్కారాలు పూర్తి చేశారు. పప్పు గోవింద గార మండలంలోని ఎస్‌డీఎన్ పేటలో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్నారు. ఎంపీపీ గొండు రఘురామ్, వైఎస్సార్ సీపీ కన్వీనర్ పీస గోపి, సర్పంచ్‌లు తమ్మిన అప్పలరాజు, బి.ఎర్రన్న, ముంజేటి కృష్ణమూర్తిలు ఆమెకు నివాళులర్పించారు.



సుశీల పార్థివ దేహం

'ఖరీఫ్ సాగుకు సిద్ధం కావాలి'



మాట్లాడుతున్న వ్యవసాయశాఖ జేడీ శ్రీధర్

శ్రీకాకుళం రూరల్: ఖరీఫ్ సాగుకు రైతులు సిద్ధం కావాలని వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ శ్రీధర్ తెలిపారు. మండల పరిధిలోని వెంకటాపురం గ్రామంలో సోమవారం నైరా వ్యవసాయ శాఖ ఫైనల్ ఇయర్ విద్యార్థులు ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరంలో ఆయన మాట్లాడారు. రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహకారాన్ని అందిస్తున్నాయని, వీటిని సక్రమంగా ప్రతి రైతు వినియోగించుకోవాలన్నారు. ఈ నెలాఖరు నాటికి నైరుతి రుతుపవనాలు మన రాష్ట్రానికి ప్రవేశిస్తున్నాయని, దీన్ని దృష్టిలో పెట్టుకొని రైతులు ఇప్పటి నుంచే ఖరీఫ్ సాగుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. జిల్లాకు 38వేల మెట్రిక్ టన్నుల వరి విత్తనాలు, 22 వేల మెట్రిక్ టన్నుల యూరియా, ఇతర క్రిమి సంహారక మందులకు ఇండెంట్‌ను ప్రభుత్వానికి పంపించినట్లు తెలిపారు. ప్రస్తుతం 10వేల మెట్రిక్ టన్నుల వరి విత్తనాలు జిల్లాకు వచ్చాయన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా విత్తనాలు, ఎరువులు విక్రయిస్తున్నట్లు చెప్పారు. నైరా వ్యవసాయ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ గేదెల జోగినాయుడు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆత్మపథక సంచాలకులు ఎ.రామచంద్రరావు, ఎచ్చెర్ల యూనియన్ బ్యాంక్ డైరెక్టర్ శ్రీనివాసరావు, నైరా కళాశాల ఆచార్యులు ఉపేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ డ్రైవర్ ఆత్మహత్య



ఆస్పత్రిలో పాతూరు గోవిందరావు మృతదేహం

పాతపట్నం: మండలంలోని కొదూరు గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ పాతూరు గోవిందరావు (26) ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొదూరు గ్రామానికి చెందిన గోవిందరావు ట్రాక్టర్ నడుపుతూ ఉండేవాడు. ఇటీవల ప్రతి రోజు మద్యం తాగుతూ రాత్రి ఇంటికి వస్తుండడంతో భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే ఆదివారం రాత్రి 9 గంటల సమయంలో మద్యం తాగి ఇంటికి రావడంతో భార్య వనిత అడగడంతో భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. దీంతో గోవిందరావు ఇంట్లో ఒక గదిలోకి వెళ్లి, క్షణికావేశంతో ఇంట్లో ఉన్న స్లాబ్ డూమ్‌కు ఉరి వేసుకున్నాడు. రాత్రి 10.30 గంటల తర్వాత గోవిందరావు చెల్లి ధనశ్రీ అన్నయ్యకు భోజనం కోసం గదిలోకి వెళ్లగా ఆయన ఉరికి వేలాడుతూ కనిపించాడు. దీంతో వెంటనే ఆమె కుటుంబ సభ్యులకు చెప్పింది. వారు గోవిందరావును కిందకు దించి ఆటోలో పాతపట్నం సీహెచ్‌సీకి తరలించారు. కానీ అప్పటికే మృతి చెందాడని వైద్యులు తెలియజేశారు. సోమవారం వైద్యులు షణ్ముఖరావు మృతదేహానికి పోస్టుమార్టం చేసి కుటుంబ సభ్యులకు అప్పగించారు. గోవిందరావుకు కుమార్తె ధర్మిణి, కుమారుడు అభిరామ్‌లు ఉన్నారు. తల్లి పాతూరు చిన్నమ్మి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ మహమ్మద్ యాసీన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

జలుమూరు: జోనంకి పంచాయతీ పరిధి కేఎల్ ఎన్‌పేటకు చెందిన ఉప్పాడ సూర్యనారాయణ ఈ నెల 16న తప్పిపోగా సోమవారం కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ రాజశేఖర్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం ఇంటి నుంచి నారాయణ వలస సంతకు వెళ్లిన సూర్యనారాయణ ఇప్పటి వరకూ ఇంటికి చేరలేదు. బంధువులు ఇంటితోపాటు చుట్టు పక్కల గ్రామాల్లో వెతికినా ఫలితం లేకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. కుమార్తె కొత్తకోట ఉమ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వృద్ధురాలు మృతి

రణస్థలం: రోడ్డు ప్రమాదంలో గాయపడిన కొయ్యాన గన్నెమ్మ(72) సోమవారం చికిత్స పొందుతూ మృతి చెందారు. జేఆర్ పురం పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం జేఆర్ పురం పంచాయతీలోని ఎస్సీ కాలనీకి చెందిన గన్నెమ్మ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి శ్రీకాకుళం రిమ్స్‌లో చేరారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం ఉదయం 6గంటల సమయంలో మృతి చెందారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని జేఆర్ పురం ఎస్‌ఐ కె.గోవిందరావు తెలిపారు.

వడదెబ్బ తగిలి మాజీ ఎంపీటీసీ మృతి



వరలక్ష్మి (ఫైల్)

జలుమూరు: జలుమూరు మాజీ ఎంపీటీసీ బగాది వరలక్ష్మి స్వగ్రామం కోన సింహాద్రిపేటలో సోమవారం మృతి చెందారు. ఉదయం ఉపాధి పనికి వెళ్లిన ఈమె ఇంటికి చేరి ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను బుడితి సీహెచ్‌సీకి తరలించగా మార్గం మధ్యలోనే ఆమె మృతి చెందారు. వడదెబ్బ తగిలి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆమెకు కూతురు, కొడుకు ఉన్నారు. ఆమె మృతిపై ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, ఎంపీపీ వాన గోపి, మాజీ ఎంపీపీ బగ్గు రామకృష్ణ, పార్టీ అధ్యక్షుడు కనుసు సీతారాం, అల్లాడ, చల్లవానిపేట పీఏసీఎస్ అధ్యక్షుడు ఎం.శ్యామలరావు, రాజప్పల నాయుడు, పైడి వితలరావు, ధర్మాన జగన్ తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

మహేంద్రతనయలో పడి యువకుడి మృతి



పెద్దింటి సాయిరాజ్ (ఫైల్)

మెళియాపుట్టి: మండలంలోని కొసమాల గ్రామానికి చెందిన పెద్దింటి సాయిరాజ్ సోమవారం మహేంద్రతనయ నదిలో పడి మృతిచెందాడు. గ్రామస్తులు, సంఘటనను చూసిన పలువురు ఒడిశా వ్యక్తులు తెలిపిన వివరాల మేరకు.. కొసమాల గ్రామానికి చెందిన పెద్దింటి సాయిరాజ్(25) తన వ్యక్తిగత పని మీద మరో స్నేహితునితో కలసి ద్విచక్రవాహనం పై ఒడిశాలోని బాగుసోల గ్రామానికి వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో బాగుసోల గ్రామానికి సమీపంలో మహేంద్రతనయ నదిలో స్నానానికి దిగాడు. ప్రమాదవశాత్తు లోతైన ప్రాంతానికి వెళ్లి తిరిగి రాలేకపోయాడు. స్నేహితుని కేకలు విని అటుగా వెళ్తున్న ఒడిశా వాసులు వెంటనే నదిలోకి దిగి సాయిరాజ్‌ను బయటకు తీశారు. అప్పటికే మృతి చెందడంతో ఒడిశాలోని గురండి పోలీసులకి సమాచారం ఇచ్చారు. వారు మృతుని కుటుంబ సభ్యులకు విషయం తెలియజేసి కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని ఒడిశా పర్లాకిమిడి ఆస్పత్రికి తరలించారు.

700 లీటర్ల బెల్లపు ఊటలు ధ్వంసం



పాత్రలోవ గ్రామంలో సారా తయారీకి ఉపయోగిస్తున్న ఊటలు ధ్వంసం చేస్తున్న పోలీసులు

మెళియాపుట్టి: మండలంలోని పాత్రలోవ గిరిజన గ్రామంలో పాతపట్నం సీఐ నల్లిసాయి, మెళియాపుట్టి ఎస్‌ఐ రాజేష్ ఆధ్వర్యంలో ఎస్ఈబీ బృందాలు, మెళియాపుట్టి పోలీసులు సంయుక్తంగా సారా తయారీ స్థావరాలపై సోమవారం సంయుక్త దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 700 లీటర్ల బెల్లపు ఊటలను ధ్వంసం చేయగా, 30 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నారు. ఇటీవల అత్యధికంగా ఆంధ్రా ఒడిశా సరిహద్దు, గిరిజన గ్రామాల్లో దాడులు నిర్వహించి నాటుసారా తయారీని నిలువరించేందుకు కృషిచేస్తున్నట్లు సీఐ సాయి తెలిపారు. అనంతరం కార్డన్ సెర్చ్ నిర్వహించి సారా తయారీ వల్ల కలిగే అనర్థాలను వివరించారు.

రైల్వేస్టేషన్ అభివృద్ధి పనుల్లో జాప్యం



పాతపట్నం రైల్వేస్టేషన్

పాతపట్నం: పాతపట్నం రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులు గత రెండు నెలలుగా నత్తనడకన చేపడుతుండడంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. రైల్వేస్టేషన్‌కు వచ్చే ప్రయాణికులకు రైలు ఎక్కలన్నా, దిగలన్నా ప్రమాదకరంగా ఉంది. రైలు ఎక్కలంటే ప్లాట్ ఫాం రెండు అడుగుల దిగువ ఉండడంతో వృద్ధులు, చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి రోజు పూరి–గుణుపూర్, గుణుపూర్–పూరి, విశాఖపట్నం–గుణుపూర్, గుణుపూర్–విశాఖపట్నం, కటక్–గుణుపూర్, గుణుపూర్–కటక్, గుణుపూర్–పలాస రైలు పాతపట్నం రైల్వేస్టేషన్ ప్రయాణికులు వెళుతూ, వస్తుంటారు. ప్రయాణికులు రైల్వే స్టేషన్ వద్ద ఉండడానికి సదుపాయం లేక ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయంలో విద్యుత్ లైట్లు, కూర్చోడానికి కుర్చీలు లేకపోవడం ఇబ్బందులు పడుతున్నారు. పాతపట్నం, టెక్కలి రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులను రూ.1.20కోట్లతో చేపడుతున్నారు. టెక్కలి రైల్వేస్టేషన్ పనులు పూర్తి కావస్తున్నాయి. పాతపట్నం రైల్వేస్టేషన్ పనులు నెలల తరబడి నత్తనడకన జరుగుతున్నాయి. దీనిపై రైల్వే అధికారులు స్పందించాలని, ఇప్పటికైనా రైల్వే స్టేషన్ ప్లాట్ ఫాం, విద్యుత్, ప్రయాణికుల కుర్చీలు తదితర అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని ప్రయాణికులు కోరుకుంటున్నారు.



వాహనంపైకి స్వామివారిని తీసుకొస్తున్న భక్తులు



కోలాటం చేస్తున్న మహిళలు

వేడుకగా తిరువీధి ఉత్సవం

నారాయణ తిరుమల కొండపై వెలసిన శ్రీవేంకటేశ్వరస్వామి వార్షిక కల్యాణోత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం తిరువీధి ఉత్సవం వైభవంగా జరిగింది. ఆలయ అర్చకులు గురుగుబెల్లి శ్రీనివాసులు, ఈఓ. శ్యామలరావుల పర్యవేక్షణలో గరుడ వాహనంపై శ్రీభూనీలా సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులను అలంకరింపచేసి ఆసీనులు చేశారు. భక్తులు స్వామిని కీర్తిస్తూ రథాన్ని లాగుతూ ఊరేగింపు చేశారు. స్వామివారి గరుడ వాహనాన్ని విద్యుత్ దీపాలతో, పూలమాలలతో అలంకరించారు. ఉదయం స్వామి రజత కవచ ధారణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. తిరువీధిలో కోలాటం బృందం ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో వేంకటరామానుజ సేవాదళం సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం కల్చరల్